
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 28.0 | కనిష్ఠం : 19.0
ANDHRAJYOTHY
3
జోగులాంబ గద్వాల
జిల్లా వార్తలు
గురువారం 11 జనవరి 2024




బాలానగర్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చిన్నారి

జాతీయ రహదారిపై..

ట్రామాకేర్ సెంటర్లు

- సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమావేశంలో నిర్ణయం
- బాలానగర్ ప్రమాద ఘటనపై ఆరా తీసిన ముఖ్యమంత్రి
- బాలానగర్, జడ్చర్ల, జానంపేట, ఎర్రవెల్లి వద్ద ఏర్పాటయ్యే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు హైవేపై ఎక్కడా లేని సెంటర్లు
- ప్రమాదాల్లో ఏడాదిలో 16 మంది మృతి.. 35 మంది క్షతగాత్రులు
- ట్రామాకేర్ సెంటర్లు ఉంటే ప్రాణాలు నిలిచేవనే అభిప్రాయం




44వ నంబర్ జాతీయ రహదారి

మహబూబ్‌నగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలోని 44వ జాతీయ రహదారి పక్కన ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, మంత్రి జూపల్లి కృష్ణారావు తాజాగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల బాలానగర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన నేపథ్యంలో.. ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి కోరిన మేరకు సీఎం, మంత్రులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జాతీయ రహదారిపై ఎక్కడ ప్రమాదం జరిగినా పది నిమిషాల్లోపే ఆస్పత్రికి చేరేలా ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, ఇందుకోసం చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు సీఎం, మంత్రి హామీ ఇచ్చారు.

30-40 కిలోమీటర్ల పరిధిలో ఒక సెంటరు ఉండాలి

ప్రభుత్వ అధ్యయనాల మేరకు కనీసం 60 కిలో మీటర్లకు ఒక ట్రామాకేర్ ఉండాలని సూచనలున్నాయి. అయితే ఇక్కడున్న ప్రత్యేక పరిస్థితులు, రద్దీ, ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్రత, జాతీయ రహదారితో పాటు సమాంతరంగా ఆయా కేంద్రాలకు రాష్ట్ర రహదారులూ అనసంధానమై ఉండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని కనీసం 30 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామాకేర్ ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని ఎమ్మెల్యేలు, వైద్యులు చెబుతున్నారు.


బాలానగర్ పీహెచ్‌సీ

ఏడాదిలో పదహారు మరణాలు

మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో బాలానగర్ నుంచి పుల్లూరు టోల్ ప్లాజా వరకు సుమారు 220 కిలోమీటర్ల పొడవున 44వ నెంబర్ జాతీయ రహదారి ఉంది. ఈ పరిధిలో అత్యవసర సమయాల్లో ప్రమాద బాధితులకు వైద్యం అందించే ట్రామాకేర్ సెంటర్ ఒక్కటీ లేకపోవడంతో ఏటా పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. పుల్లూరు నుంచి పెబ్బేరు వరకు ప్రమాదాలు జరిగితే అటు కర్నూల్‌కు, రాజాపూర్ నుంచి బాలానగర్ వరకు ప్రమాదాలు జరిగితే ఇటు మహబూబ్‌నగర్‌కు, అటు హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నారు. మధ్యలో జడ్చర్ల నుంచి కొత్తకోట వరకు ఎక్కడ ప్రమాదాలు జరిగినా మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు దాని తీవ్రతను బట్టి ఐదు నుంచి పది నిమిషాల్లోపు బాధితులకు సరైన వైద్యం అందితే ప్రాణాలతో బయటపడవచ్చని అనేక అధ్యయనాలు, నివేదికలు తేల్చిచెప్పాయి. ఈ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం జాతీయ రహదారులపై ప్రతీ 60 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖకు సూచించింది. ప్రభుత్వాల నుంచి ఈ సెంటర్ల ఏర్పాటుకు స్పష్టమైన సూచనలున్నప్పటికీ ఆ దిశగా వైద్యఆరోగ్యశాఖ సరైన కార్యాచరణ చేపట్టకపోవడంతో ఏర్పాటు చేయలేదు. మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలను పరిశీలిస్తే 2023 సంవత్సరంలో జాతీయ రహదారిపై ఈ మూడు జిల్లాల పరిధిలో జరిగిన ప్రమాదాల్లో సకాలంలో సరైన వైద్యమందక 16 మంది చనిపోయారు. మరో 35 మంది వరకు అవయాలు కోల్పోయారు. జాతీయ రహదారితో పాటు ఇతర రహదారులపైనా ప్రమాదాలు జరిగి, ప్రాణాలు కోల్పోయిన వారు ఈయేడాదిలో మరో 22 మంది ఉన్నారు. వీరికి సకాలంలో సరైన వైద్యమందితే బతికేవారని చెబుతున్నారు. హైవేపైనా, అన్ని ఇతర రోడ్లకు సమీపంలో ఉండేలా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటైతే ఈ మర



ణాల్లో కనీసం 50 శాతమైనా తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బాలానగర్, జడ్చర్ల, జానంపేట, ఎర్రవెల్లి వద్ద ఏర్పాటుకు అవకాశం

44వ నెంబర్ జాతీయ రహదారిపై ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అనుగుణంగా ఉండేలా బాలానగర్, జడ్చర్ల, జానంపేట, ఎర్రవెల్లి వద్ద ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే సూచనలు వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనూ ఈ ప్రతిపాదనలు ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. జానంపేట పీహెచ్‌సీ వద్ద ఐదెకరాల స్థలాన్ని కూడా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు అప్పట్లో ప్రతిపాదించారు. ఇక్కడున్న పీహెచ్‌సీని 50 పడకలకు పెంచి, దాంట్లోనే సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కానీ ముందుకు సాగలేదు. తాజాగా మళ్లీ ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు అంశం తెరమీదకు రావడంతో ఈనాలుగు ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందనే అభిప్రాయం వెల్లడవుతోంది.


జానంపేట పీహెచ్‌సీ

అందుబాటులో అత్యవసర వైద్యం

ట్రామాకేర్ సెంటర్లు ఏర్పాటైతే అక్కడ ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స అందించే నిమిత్తం 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ సెంటర్లు మూడు రకాలుగా ఉంటాయి. ఎల్-3 ట్రామాకేర్ సెంటర్ అయితే ఏడాదికి రూ.తొమ్మిది కోట్ల నిర్వహణ వ్యయం ఉంటుంది. ఎల్-2 సెంటర్ అయితే ఏడాదికి రూ.20 కోట్లు, ఎల్-3 ట్రామాకేర్ సెంటర్ అయితే ఏడాదికి రూ.50 కోట్ల వరకు వ్యయం ప్రభుత్వం అందిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యయాన్ని భరిస్తాయి. ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటైన ప్రతీ చోటా ఆర్థోపెడిక్ సర్జన్, న్యూరో సర్జన్, న్యూరో ఫిజీషియన్, కార్డియాక్ స్పెషలిస్టుతో ఇతర సాంకేతిక సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారు. అదేవిధంగా ప్రతీ కేంద్రం వద్ద బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేస్తారు. వీటితో పాటు మూడు ప్రత్యేక అంబులెన్సులు ఈ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుతారు. ప్రమాదాల్లో గాయపడ్డ వారిని అంబులెన్స్‌ల ద్వారా ఈ కేంద్రం వద్దకు తెచ్చిన వెంటనే అవసరమైన అత్యవసర చికిత్స అందిస్తారు. వెంటనే అవసరమైతే ఆర్థోపెడిక్, ఇతర సర్జరీలు నిర్వహిస్తారు. ఆక్సిజన్, ఎమర్జెన్సీలో ఉపయోగించే ఇంజక్షన్లు, మందులు కూడా అందుబాటులో ఉంచుతారు. ప్రమాద బాధితుల ప్రాణాలు పోకుండా ఉండేందుకు అవసరమైన మేర చికిత్సను ఈ సెంటర్ల ద్వారా అందిస్తారని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ కేంద్రం ఏర్పాటైతే ఒక మోస్తారు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటైనట్లేనని అంటున్నారు. కేవలం ప్రమాద బాధితులకే కాకుండా ఇతర సమయాల్లో సాధారణ రోగులు, దీర్ఘకాలిక రోగులకు సైతం అదే స్థాయిలో ఇక్కడ వైద్య సేవలు అందుతాయి.

వ్యవసాయ మోటార్ల దొంగల అరెస్టు

- నలుగురి రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 10: మోటార్ల దొంగతనానికి పాల్పడిన ఇద్దరితో పాటు వారి నుంచి ఆ మోటార్లను కొనుగోలు చేసిన మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు నాగర్‌కర్నూల్ ఎస్ఐ మహేందర్ బుధవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ మండలం పెద్దాపూర్ గ్రామంలోని కేఎల్ఐ కాల్వలో ఏర్పాటు చేసుకున్న రెండు వ్యవసాయ బోర్లను అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి గ్రామానికి చెందిన దాసరి మహేష్, గుంటి కరుణాకర్ దొంగిలించారు. వాటి విలువ రూ.40 వేలు ఉంటుందని తెలుస్తోంది. వాటిని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత ఇనుప సామాను కొనుగోలు చేసే లక్ష్మయ్య, సురేష్‌లకు విక్రయించారు. మోటార్ల అపహరణపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేశారు. వాటిని దొంగిలించిన, కొనుగోలు చేసిన నలుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


బోల్తాపడ్డ కారు

కారు బోల్తా

తాడూరు, జనవరి 10: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం ఒక కారు విద్యుత్ స్తంభానికి ఢీకొని, బోల్తా పడింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడూరు మండలం అంతారం గ్రామానికి చెందిన వ్యక్తి జడ్చర్ల నుంచి అంతారం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. కారు బోల్తా పడిన సమయంలో కారులో ఒక్కరే ఉన్నారని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు కాలేదని ఎస్సై రామన్‌గౌడ్ తెలిపారు. కారు డ్రైవర్‌కు గాయాలు కాలేదు.


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు




సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు




అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యాంక్ చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

పర్వతాపూర్ మైసమ్మ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న గ్రామస్థులు

నవాబ్‌పేట, జనవరి 10 : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవస్థానంలో బుధవారం అమ్మవారి జాతర మహోత్సవాల హుండీ లెక్కింపు చేపట్టారు. 33 మాసాల వెండి, రూ.లక్షా ఇరవై మూడువేల నగదు వచ్చినట్లు ఆలయ చైర్మన్ పాశం కృష్ణయ్య, ఈఓ మదనేశ్వర్ రెడ్డి తెలిపారు. జాతరను విజయవంతం చేసిన భక్తులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైస్ ఎంపీపీ సంతోష్ రెడ్డి, సర్పంచ్ జంగమ్మ, వేణుచారీ, నారాయణ రెడ్డి, తానెం రాజు, మాదవులు, మైనుద్దీన్, ఆలయ సిబ్బంది గోపాల్, నర్సింహులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 10 : బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ అడ్మిషన్స్ ప్రవేశాల కోసం ఈ నెల 31లో దరఖాస్తు చేసుకోవాలని ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మావతి, వర్సిటీ సెంటర్ రీజనల్ కో ఆర్డినేటర్ సత్యనారణ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యను చదవాలనుకున్నవారు దరఖాస్తులు చేసుకోవాలని, ఇతర వివరాలకు సెంటర్‌లో సంప్రదించాలని తెలిపారు.

'బీఎడ్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ నిర్వహించాలి'

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 10 : పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న బీఎడ్ కళాశాల విద్యార్థులకు డీఎస్సీ, టెట్‌ను దృష్టిలో పెట్టుకుని నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. బుధవారం పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్‌కు స్వేరో పీయూ విద్యార్థి నాయకులు రూప్‌సింగ్, నాగార్జున, ప్రేమలత, అఖిల, రాధిక, సౌలేశ్వరి, శేఖర్ వినతి పత్రం అందజేశారు.

ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల, జనవరి 10 : ఈఎంఆర్ఐ(108) సంస్థలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్‌గా పని చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని 108, 102 సర్వీసెస్ మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ మహబూబ్‌మియా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ కోర్సులు చేసిన వారు 30 సంవత్సరాల లోపు ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 12న జడ్చర్లలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని 108 కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు ఒక సెట్ జిరాక్స్‌కాపీలను వెంట తీసుకురావాలని కోరారు.

రవీంద్రటాకీస్‌లో ఎగిసిపడ్డ మంటలు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నాగనూల్ చౌరస్తాలో గల రవీంద్రటాకీస్‌లో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న నాగర్‌కర్నూల్‌తో పాటు, కల్వకుర్తి అగ్నిమాపక వాహనాలు మంటలను ఆర్పివేశారు. చాలా ఏళ్లుగా ఈ థియేటర్ మూతపడడంతో చెత్తచెదారం పేరుకుపోయింది. ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలతో ప్రొజెక్టర్‌తో పాటు, కుర్చీలు, అందులో ఉన్న డోర్లు కాలి అగ్నికి ఆహుతి అయ్యాయి.

యాంత్రీకరణతోనే సాగు లాభదాయకం

- ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి



వేరుశనగ డిగ్గర్ యంత్రం పనితీరును వివరిస్తున్న ఏడీఆర్

బిజినేపల్లి, జనవరి 10 : పంటల సాగుకు విరివిగా యంత్ర పరికరాల వినియోగం పెంచుకోవడం ద్వారా పెట్టుబడి తగ్గడంతో నాణ్యమైన పంట ఉత్పత్తుల వల్ల వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం అల్లీపూర్‌లో బుధవారం వేణుగోపాల్ అనే రైతు పొలంలో వేరుశనగ డిగ్గర్ అనే యంత్రం పనితీరుపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించి, మాట్లాడారు. వేరుశనగ సాగులో పంట కోత సమయంలో కూలీల అవశ్యకత ఎక్కువగా ఉండడం వల్ల పెట్టుబడి ఎక్కువ అవుతున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. పెట్టుబడి తగ్గించడంతో పాటు, కూలీల కొరతను అధిగమించేందుకు వివిధ పంటల సాగులో యాంత్రీకరణ వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. అలాగే, ఈ ప్రాంత నేలలకు అనువైన వేరుశనగ పంట రకాలను, తీసుకోవల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు స్రవంతి, రామకృష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి నీతిరెడ్డి, ఏఈఓ మధు, 65 మంది రైతులు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్నాం...

ప్రాజెక్టులు మాకొద్దు

- కాల్వల ద్వారా న్యాయం చేయండి

- తహసీల్దార్ కార్యాలయంలో బాధిత రైతుల వినతి



బల్మూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ పద్మకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

బల్మూరు, జనవరి 10 : ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణం కోసం తాము భూములు కోల్పోతున్నామని, తమ పరిస్థితి ఏంటని, తాము ఎలా బతకాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామ సమీపంలో ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు తెలుపడంతో భూములు కోల్పోతున్న రైతులు లోలోపల మదనపడుతున్నారు. గత ప్రభుత్వం రూపకల్పన చేసిన ప్రాజెక్టు నిర్మాణం మ్యాపుల ద్వారా ప్రజలకు కొంత ఊరట ఇచ్చినప్పటికీ ప్రస్తుత కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాజెక్టు నూతన నిర్మాణం పేరున ప్రణాళిక రచించి కొత్తగా విడుదల చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత ప్రాజెక్టు ఒకవైపు అయితే నూతనంగా ఏర్పడే ప్రాజెక్టు నిర్మాణం కోసం చేస్తున్న కృషిలో నూత నంగా వచ్చిన ప్రభుత్వం ఎంతవరకు సఫలీకృతమవుతుందో తెలియదు కానీ రైతులకు మాత్రం ఆవేదన మిగిలింది. నూతన ప్రాజెక్టు ద్వారా దాదాపు రెండు వేల 500ఎకరాల నుంచి మూడు వేల ఎకరాల వరకు సాగుభూమి కోల్పోతున్నట్లు సమాచారం గట్టిగా ఉన్నప్పటికీ రైతులు ఉన్న భూములను కోల్పోతే చివరకు మిగిలేది ఏముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, ఎమ్మెల్యే వంశీకృష్ణ రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. పాత ప్రభుత్వం ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ప్రాజెక్టు నిర్మాణం కోసం చేపట్టే దేవస్థానం నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏదేమైనా ప్రభుత్వాలు మారుతున్న కూడా రైతుల జీవితాలతో ఆటలాడుకునే విధంగా ప్రభుత్వ సంస్థలు, అధికారులు ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రతినిత్యం కృషి చేస్తున్న వ్యవస్థను బట్టి కొందరు రైతులు నష్టపోతే వందలాది మంది రైతులు బాగుపడుతారు. మరోవైపు ప్రభుత్వం నాటి ప్రా జెక్టుల పైన ఉన్న విధివిధానాలను చూస్తూ నూత నంగా వచ్చే ప్రాజెక్టు నిర్మాణంలో మార్పుచేర్పులను కూడా ఆలోచించడంపై కొందరు మేధావులు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కృషి చేస్తున్నదని వారు పేర్కొన్నారు. రైతుల కోసం పనిచేసే ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసి, విధివిధానాలురూపొందించాలని మండల రైతులు కోరుతున్నారు.

'పాలమూరు-రంగారెడ్డి'పై విచారణ జరపాలి

- పాలమూరు అధ్యయన వేదిక

మహబూబ్‌నగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, నూతనంగా గెలిచిన ఎమ్మెల్యేలు పాలమూరు- రంగారెడ్డి లిఫ్ట్ అవినీతిపై పోరాటం చేయాలని, ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై జరుగుతున్నంత చర్చ పాలమూరు- రంగారెడ్డి, పాలమూరు-డిండి ప్రాజెక్టుల అవినీతిపై జరగడం లేదని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈరెండు పథకాల అవినీతిపైకూడా తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు అవినీతిపై తీవ్రంగా ఆరోపణలు చేసిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి తన స్వప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌లో చేరారని, ఆయన ఇప్పుడు నోరుమెదపరని అన్నారు. ప్రాజెక్టు రీడిజైన్ వల్ల వ్యయం భారీగా పెరిగిందని, అవినీతి కోసమే రీడిజైన్ చేశారని రైతాంగం భావించారని పేర్కొన్నారు. రీడిజైన్ చేశాక కూడా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టలేదని విమర్శించారు. నిర్మాణం చేపట్టిన నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్లను ఎక్కడాలేని విధంగా చుట్టూ కట్టలుగా చాలా బలహీనంగా నిర్మించారని, వాటితో మున్ముందు చాలా కష్టనష్టాలకు అవకాశ ముందని, నిపుణులు, ఇంజనీర్లు లేఖలురాసినా అప్పటి సీఎం కేసీఆర్ ఖాతరు చేయలేదని పేర్కొన్నారు. ఉద్యమ పార్టీ అనేభావనతో బీఆర్ఎస్‌ని గెలిపిస్తే, తెలంగాణలోనే అత్యంత వెనకబడిన పాలమూరుకు ఏమీ చేయలేదని దుయ్యబట్టారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల నిర్వహణే ఆ పార్టీ మోసం చేసిన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

నవాబ్‌పేట, జనవరి 10 : మండలంలోని హన్మసానిపల్లి గ్రామానికి చెందిన చెన్నారం కృష్ణయ్య పదేళ్ల క్రితం బైక్‌పై వెళ్తూ కిందపడ్డాడు. అప్పటినుంచి మతిస్థిమితం లేక ఊర్లో, బంధువుల వద్దకు ఎక్కడపడితే అక్కడ తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఐదేళ్ల నుంచి ఇంటికి రావడం లేదని, ఇతని ఆచూకీ కనిపెట్టాలని ఆయన భార్య చెన్నారం లక్ష్మీదేవి బుధవారం నవాబ్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సురేష్‌బాబు తెలిపారు.

కాళేశ్వరంపై సీబీఐతో విచారణ జరిపించాలి

» బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



జడ్చర్లలోని అయ్యప్పస్వామి దేవాలయంలో పూజ చేస్తున్న డీకే అరుణ

జడ్చర్ల, జనవరి 10 : కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐతో విచారణ చేయించాలని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని గంగాపురం రోడ్డులో గల అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఎన్నికల ముందు మాట్లాడింది వేరని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట్లాడుతున్నది వేరుగా ఉందని ఆరోపించారు. కాళేశ్వరంపై జరిగిన అవినీతిని బయటికి తేవాలని, అవినీతి పరులు ఏ విధంగా కుమ్మక్కయ్యారు?, నిర్మాణంలో జరిగిన లోపాలేంటి?, రూ.లక్షల కోట్లకు అంచనా ఎందుకు పెరిగింది?, వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన వారిని బట్టబయలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ అవకాశం కాంగ్రెస్‌కు పార్టీకి ప్రజలు ఇచ్చారని అన్నారు. కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలో జరిగిన అవినీతి కక్కించాలంటే సీబీఐతో విచారణ చేయించాలని కోరారు. జ్యుడీషియల్ విచారణతో అవినీతి బట్టబయలు అవుతుందనే విశ్వాసం ఉండదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలతో పాటు తెలంగాణలో, దేశవ్యాప్తంగా మళ్లీ ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో ఇతర పార్టీలకు ఓటు వేసినా, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేస్తామని, నరేంద్రమోదీ నాయకత్వమే కావాలని ప్రజలు అంటున్నారని చెప్పారు. మూడో పర్యాయం నరేంద్రమోదీ ప్రధాన మంత్రి అవుతున్నారన్నారు. నరేంద్రమోదీకి పోటీ ఇచ్చే అభ్యర్థి కాంగ్రెస్ పార్టీలో జాతీయ స్థాయిలో లేరన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సాహితిరెడ్డి, చెవ్వ నాగరాజు, మధు, కొంగళి శ్రీకాంత్, అమర్నాథ్‌గౌడ్, అయ్యప్ప స్వాములు రంజిత్ బాబు, ఎర్ర శ్రీనుతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తాకి రైతు మృతి



సామ్యానాయక్ (ఫైల్)

లింగాల, జనవరి 10 : నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండల పరిధిలోని కొత్తచెర్వు తండాకు చెందిన రైతు ముడావత్ సామ్యానాయక్ (60) విద్యుత్ షాక్‌కు గురై బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సామ్యానాయక్ రబీలో తన సొంత వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటను సాగు చేసుకు న్నాడు. అడవి పందుల నుంచి పంటను రక్షించుకోవడానికి పంట చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం రాత్రి చేనుకు నీటి తడిని పెట్టి తెల్లవారు జామున బోరుమోటారును బంద్ చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కంచెను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం వరకు కూడా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం దగ్గరికి వెళ్లగా మృతదేహం కనిపించింది. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

రేషన్‌లో ప్రొటీన్స్ బియ్యం ?

- ప్లాస్టిక్ బియ్యం అంటూ లబ్ధిదారుల అనుమానం

- ఆందోళన వద్దని తహసీల్దార్ సూచన

నవాబ్‌పేట, జనవరి 10 : పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయంటూ మండలంలో రెండు రోజులు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. పేద ప్రజలకు మంచి ఆహారం ఇవ్వాలన్న భావనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ నెల చౌకధర దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం ప్లాస్టిక్ బియ్యం కలిపారని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలుకు మూడు కిలోల ప్రొటీన్స్ లభించే చిరుధాన్యాలను కలిపి బియ్యంలో కలిపి అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఉన్న పేదలు తీసుకునే బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయంటూ ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గురుకుంట, కారుకొండ తదితర గ్రామాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన బియ్యాన్ని బుధవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా అవి ప్రొటీన్స్ బియ్యం అంటూ సివిల్ సప్లై, మండల డీలర్లు తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ మల్లికార్జున్ రావును వివరణ కోరగా పేదలకు అందిస్తున్న ప్రొటీన్స్ బియ్యం అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.

వ్యక్తి రిమాండ్

గోపాల్‌పేట, జనవరి10: అమ్మాయి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు బుధవారం ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఓ తండాకు చెందిన అమ్మాయి పట్ల కాట్రావత్ సంతోష్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు ఈనెల 5న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి సంతోష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

తొమ్మిది క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

- ఒకరిపై కేసు నమోదు

లింగాల, జనవరి 10 : అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుబడినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామానికి చెందిన భాస్కర్ మంగళవారం రాత్రి మహేంద్రా వాహనంలో లింగాలకు బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా ఉంచినట్లు ఎస్సై చెప్పారు. మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ఉంచిన వాహనాన్ని సోదా చేయగా అందులో 30 బస్తాల నల్లబెల్లం కన్పించింది. వాహనంతో పాటు, మరో వాహనాన్ని స్వాధీనపర్చుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్‌కు ఘన సన్మానం



వార్డెన్‌లను సన్మానిస్తున్న పీయూ అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 10 : మైక్రోబయాలజీలో ఎన్నో పరిశోధనలు చేసినందుకు గాను మైక్రోబయాలజీస్ట్స్ సొసైటీ అఫ్ ఇండియా (ఎంబీఎస్ఐ) ఫెలో షిప్ అవార్డును పాలమూరు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, పీయూ రీసెర్చ్ సెల్ డైరెక్టర్, యంగ్ సైటిస్ట్ మైక్రోబయాలజీ అధ్యాపకులు ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్‌ను బుధవారం పీయూ పీజీ కళాశాల, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, అన్ని విభాగాల అధిపతులు, అధికారులు ఘనంగా సత్కరించారు.

● ఇదిలా ఉంటే బాలుర హాస్టల్ వార్డెన్‌లుగా దాదాపు ఏడేళ్లపాటు సేవలు అందించిన సురేష్, శ్రీనివాస్‌లను శాలువా, పూలబొకేతో ఘనంగా సన్మానించారు. ఓ వైపు విద్యార్థులకు బోధిస్తూనే, అదనంగా వార్డెన్ బాధ్యతలు నిర్వహించారు. వీరిని రిలీవ్ చేసి, వారే వారికి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పీయూ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

16 పెద్దకార్పాములలో అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

పెద్దకొత్తపల్లి, జనవరి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల గ్రామంలో ఈనెల 16వ తేదీన ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర న్యూకేటగిరీ విభాగం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఫ్రెండ్స్ యువజన సంఘం సభ్యుడు సొంటె ఎల్లయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనే వృషభరాజుల యాజమానులకు మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.40వేలు, మూడవ బహుమతి రూ.30వేలు, నాల్గవ బహుమతి రూ.20వేలు, ఐదవ బహుమతి రూ.10వేలు, ఆరో బహుమతి రూ.8వేలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే, పోటీలో పాల్గొనే ప్రతీ ఎద్దుల జతకు రూ.ఐదు వేల ప్రోత్సాహక బహుమతులను అందిస్తామన్నారు. బండలాగుడు పోటీల్లో పాల్గొనే ఎద్దుల యాజమానులు వెయ్యి రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి అదేరోజు ఉదయం ఎనిమిది గంటలలోపు పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పోటీలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా వస్తున్నట్లు వారు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, పోటీలను తిలకించాలని ఆయన కోరారు.

మార్కెట్‌కు వచ్చిన ఉల్లి



ఉల్లికి వేలం వేస్తున్న వ్యాపారస్తులు

దేవరకద్ర, జనవరి 10 : దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు పండించిన ఉల్లి విక్రయించేందుకు బుధవారం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చారు. మార్కెట్‌లో జరిగిన లావదేవీల్లో గరిష్ఠంగా రూ.2000, కనిష్ఠంగా రూ.1000, ధర పలికినట్లు మార్కెట్ సెక్రటరీ ఎల్లయ్య తెలిపారు. వ్యాపారులు, కొనుగోలుదారులు ఉల్లిని కొనుగోలు చేశారు. ఇప్పుడు సీజన్ కావడంతో మార్కెట్‌కు ఉల్లి వస్తున్నది. ఇంకా పెద్ద మొత్తంలో మార్కెట్‌కు రానుందని అధికారి తెలిపారు. మార్కెట్‌కు 265 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు ఆయన తెలిపారు.

కందులు కొనుగోలు చేయాలి

అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్

గద్వాల న్యూటౌన్, జనవరి 10 : ధరల స్థిరీకరణ నిధి పథకం కింద రైతుల నుంచి మార్కెట్ ధరకు అనుగుణంగా కందులు కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 22,590 ఎకరాల్లో రైతులు కంది సాగు చేశారని తెలిపారు. ఎకరానికి ఐదు క్వింటాళ్ల చొప్పున గరిష్ఠంగా కొనుగోలు చేయాలని చెప్పారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా 10 కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీవో ప్రసాద్, డీఎంవో పుష్ప, డీఏవో గోవిందునాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల బ్రాంచి ప్రధాన కార్యదర్శి రంగారావు



ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

గద్వాల టౌన్, జనవరి 10 : సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం గద్వాల బ్రాంచి ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు కోరారు. పట్టణంలోని ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయంలో ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామంలో గంట పాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన సవరణ సంఘం ఏర్పాటై ఏడాది గడచినా, ఇప్పటివరకు సంఘాలను చర్చకు పిలవలేదన్నారు. కొత్త పెన్షన్ విధానంలో మేనేజ్‌మెంట్ కంట్రిబ్యూషన్ ప్రస్తుతం ఉన్న పది శాతాన్ని 14 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినా, అమలు కాలేదన్నారు. దీంతో పాటు దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న అన్ని కేడర్‌ల ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. పబ్లిక్ రంగ సంస్థలోని శ్రామికులను, వారి భవిష్యత్తును నిర్లక్ష్యం చేసే దిశగా చేపడుతున్న కార్యక్రమాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బ్రాంచ్ అధ్యక్షుడు సూరజ్, అధికారులు, ఉద్యోగులు రాజేంద్రకుమార్, రాజేంద్రప్రసాద్, బషీర్, నరేంద్రబాబు, రాఘవేంద్ర, కిశోర్, శివ, వంశీధర్ రెడ్డి, రంగయ్య, కృష్ణ, చైతన్య, పద్మావతి, పద్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గద్వాల టౌన్, జనవరి 10 : సమస్యల పరిష్కారం కోసం పాలకులపై ఒత్తిడి తెచ్చేలా నిరంతర పోరాటం సాగిద్దామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి (ఎన్‌హెచ్‌పీఎస్) జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సమితి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాట సమితిని మరింత బలోపేతం చేసేలా గ్రామ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వచ్చే గ్రామపంచాయతీ, మండల జిల్లా పరిషత్ ఎన్నికల్లో సమితి తరఫున అభ్యర్థులను నిలిపేందుకు సమాయత్తం కావాలని సూచించారు. ఈ విషయంపై గ్రామ కమిటీ నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు గోవిందు, మునెప్ప, రాము, వీరేష్, పరుశరాముడు, ఆంజనేయులు, మల్దకల్ పాల్గొన్నారు.

విజేతలుగా తిరిగి రావాలి

కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అబ్రహాం

గద్వాల అర్బన్, జనవరి 10 : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి విజేతలుగా తిరిగి రావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అబ్రహాం ఆకాంక్షించారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు గజ్వేల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. క్రమశిక్షణతో మంచి ఆట తీరును కనబరచి జాతీయస్థాయికి ఎంపిక కావాలన్నారు. జిల్లా బాలుర జట్టుకు కోచ్‌లుగా రఘు, సద్దాంహుసేన్, బాలికల జట్టుకు కోచ్‌లుగా రేష్మ, హరికృష్ణ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు తిరుపతి, రజనీకాంత్, మోహన్, రవి, సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ హయాంలో దేశాభివృద్ధి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ, జనవరి 10 : ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. అయిజ మండల పరిధిలోని మేడికొండ, బింగిదొడ్డి గ్రామాల్లో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, యువత, మహిళలు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో అయిజ స్టేట్ బ్యాంక్ మేనేజర్ అశోక్, నాయకులు వెంకటేష్, గోపాలకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

వడ్డేపల్లి, జనవరి 10 : పీఆర్‌టీయూ టీఎస్ వడ్డేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో నరసింహ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాల్, జిల్లా బాధ్యులు ఉషన్న, సీనియర్ సభ్యులు సిద్ధయ్య, మనోహర్‌బాబు, బలరాం, నరేష్‌కుమార్, సురేష్‌కుమార్, చెన్నారెడ్డి, సూర్యబాబు, హరిప్రసాద్, వీరేష్, వినోద్‌సింగ్, రూపాబాబ్, సరిత, దేవేంద్ర రెడ్డి, మక్బూల్, ప్రధాన కార్యదర్శి శేషన్న పాల్గొన్నారు.

రుణాలు అందించి సహకరించాలి

బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్, వేదికపై ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, జనవరి 10 : బ్యాంకర్లు రుణాలు అందించడంలో ప్రజలకు, రైతులకు సహకరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్‌తో పాటు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ నెల గ్రామ పంచాయితీ, రైతు వేదికలలో బ్యాంకుల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరు ఎంత టార్గెట్ రీచ్ అయ్యారో సమీక్షించుకోవాలని, సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు స్వయం ఉపాధి కల్పించేందుకు అందరి సహకారంతో కొన్ని పథకాలు తీసుకొస్తే బాగుంటుందన్నారు. నాబార్డు ద్వారా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా రుణాలు చెల్లించేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్బీఐ అధికారి దిభోజిత్ బొర, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, జడ్పీ సీఈవో కాంతమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రి పనులను పూర్తి చేయాలి

జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న 300 పడకల ఆసుపత్రి పనులను వెంటనే పూర్తి చేసి, అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలలకు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ వివరాలు, మార్పులు, పనుల పురోగతి తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీటి వసతులను ఫిబ్రవరి లోపు పూర్తి చేయాలన్నారు. ప్రధాన రహదారి నుంచి ఆసుపత్రి గేటు వరకు సీసీ రోడ్డు, ఆసుపత్రి భవనం వెనుక వైపు కాంపౌండ్ వాల్, సెప్టిక్ ట్యాంకు, అదనపు నీటి అవుట్‌లెట్ పాయింట్ వద్ద సోక్‌పిట్ నిర్మించాలని సూచించారు. అన్నింటినీ దృష్టిలో ఉంచుకొని జనరేటర్లను అమర్చాలన్నారు. పబ్లిక్ హెల్త్ సెంటర్ పురోగతి తెలుసుకొని, త్వరగా పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. అలంపూర్ వంద పడకల ఆసుపత్రికి మిషన్ భగీరథ నీటి కనెక్షన్, డ్రైనేజీ సిస్టం పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఈనెల 20 వరకు సీఎంఆర్ పూర్తి చేయాలి

ఖరీఫ్, రబీకి సంబంధించి కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ఈ నెల 20వ తేదీ వరకు పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ మిల్లర్లను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లింగ్ సామర్థ్యాన్ని బట్టి రోజువారీ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సీఎంఆర్‌ను ప్రభుత్వానికి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా బియ్యం అందించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అదనపు కలెక్టరు చీర్ల శ్రీనివాస్, డీఎం విమల, అధికారులు కనకయ్య, మంగమ్మ, రైస్ మిల్లర్లు ఉన్నారు.

క్రెడిట్ ప్లాన్ కరదీపిక విడుదల

నాబార్డు పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (పీఎల్‌పీ) కరదీపికను బుధవారం కలెక్టర్ బీఎం సంతోష్ ఆవిష్కరించారు. కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కోసం రూ.3161.99 కోట్లు, వ్యవసాయం, అనుబంధ కార్యకాలపాల కోసం టర్మ్‌లోన్ రూ. 475.57 కోట్లు కేటాయించిందని తెలిపారు. వ్యవసాయంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.96.32 కోట్లు, అనుబంధ కార్యకలాపాల కోసం రూ. 357.34 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎమ్ఎస్ఎమ్ఈ) కోసం రూ. 474.47 కోట్లు, మొత్తంగా రూ. 4721.77 కోట్లుగా ఆర్థిక అంచనా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు వ్యవసాయ అధికారి గోవిందునాయక్, పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు, నాబార్డ్ డీడీఎం అయ్యపురెడ్డి పాల్గొన్నారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన కలెక్టర్

జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ న్యాయాధికారి కె.కుషను కలెక్టర్ బీఎం సంతోష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలి సారి న్యాయాధికారిని కలిసినట్లు ఆయన తెలిపారు.

రైతువేదిక ప్రారంభోత్సవం రసాభాస

ఇరువర్గాల మధ్య వాగ్వాదం ▸ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల ఎదుటే తోపులాట



వాగ్వాదానికి ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు

అలంపూర్ చౌరస్తా/అలంపూర్, జనవరి 10 : మండల పరిధిలోని బుక్కాపూరం గ్రామంలో బుధవారం జరిగిన రైతువేదిక భవన ప్రారంభోత్సవం రసాభాసగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.12 లక్షలు, పంచాయతీరాజ్ ద్వారా రూ.10 లక్షలు, మొత్తం రూ.22 లక్షలతో గ్రామంలో రైతు వేదికను నిర్మించారు. దీని ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు లేకుండా, ప్రొటోకాల్ పాటించకుండా భవనాన్ని ఎలా ప్రారంభిస్తారంటూ వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ కార్యకర్తలు వారిని అడ్డుకునేం దుకు యత్నించడంతో తోపులాట జరిగింది. కొందరు కార్యకర్తలు కిందపడిపోయారు. గొడవ పెద్దది కావడంతో గ్రామ పెద్దలు ఇరు వర్గాలకు నచ్చచెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలను అక్కడి నుంచి పంపించేశారు.

విద్యాభివృద్ధికి కృషి : ఎమ్మెల్సీ చల్లా

నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని సింగవరం గ్రామంలో నిర్మించిన ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం బుక్కాపురం గ్రామంలోని అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వాల్మీకి దేవాలయం, దర్గాలను దర్శించుకున్నారు. ఆ తర్వాత రైతు వేదికను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రూపాదేవి, ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఊట్కూరు సర్పంచు అయ్యస్వామి, అయ్యన్న, వసంత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



బల్గెరలో గ్రామ పంచాయతీ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

గట్టు, జనవరి 10 : మండల పరిధిలోని అంతంపల్లి, బల్గెర గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అంతంపల్లి, బల్గెర గ్రామాల్లో నిర్మించిన నూతన పంచాయతీ భవనాలు, బల్గెరలో మన ఊరు - మన బడి, బస్టాండ్, పల్లె ప్రకృతివనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో సాధ్యం కాని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు ఆంజనేయులు గౌడు, జడ్పీటీసీ సభ్యురాలు శ్యామల, ఎంపీపీ విజయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడ, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, వైస్ ఎంపీపీ సుమతి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హన్మంతునాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు రూపవతి పాల్గొన్నారు.

శిలాఫలకాలపై మాజీ చైర్మన్ల పేర్లు

మండలంలోని అంతంపల్లి, బల్గెర గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సంబంధించిన శిలా ఫలకాలపై మాజీ చైర్మన్ల పేరు ఉండడం చర్చకు దారి తీసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర స్థాయి చైర్మన్‌గా ఉన్న ఒకరి పేరుతో పాటు, జిల్లా స్థాయి సంస్థలకు చైర్మన్లుగా ఉన్న వారి పేర్లు శిలాఫలకాలపై ఉన్నాయి. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరు కావడం గమనార్హం.

రైతు బీమా చెక్కు అందజేత

మల్దకల్ మండల పరిధిలోని చిప్పదొడ్డి గ్రామానికి చెందిన రైతు బోయ బజారి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో ఆయన కుటుంబానికి రైతుబీమాగా ఐదు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. బాధిత కుటుంబసభ్యులకు బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రైతు బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటన్న, నాయకులు శేషాద్రినాయుడు, శివన్న, తిమ్మప్ప, వెంకటేష్, జమ్మన్న, డోల్ తిమ్మప్ప, చిన్న ఆంజనేయులు, హనుమంతు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ రితిరాజ్ ▸ పోలీసు అధికారులతో వర్చువల్ సమావేశం



వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల క్రైం, జనవరి 10 : జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఉత్పత్తి, సరఫరా, రవాణాపై పటిష్టనిఘా ఉంచాలని ఎస్పీ రితిరాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి బుధవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు సంబంధించిన కేసుల్లో ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పకడ్బందీగా లోతైన విచారణ చేపట్టాలన్నారు. ఫీల్డ్‌లో, రోడ్ల మీద మాదక ద్రవ్యాలు పట్టుబడితే అనుసరించాల్సిన విధి విధానాలపై పోలీస్ అధికారులు పూర్తి అవగాహన కల్గి ఉండలన్నారు. ఆయా కేసులలో నిందితులకు శిక్ష పడేలా అధికారులు కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్లలో రెగ్యులర్‌గా అమలవుతున్న ఫంక్షనల్, వర్టికల్ అయిన రిసెప్షన్ మేనేజ్మెంట్, ఎస్‌హెచ్‌వో వర్టికల్‌లలో పని తీరును మెరుగుపరుచుకోవాలన్నారు. అయా విభాగాల సిబ్బందిపై నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. వారంలోగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టి నో నంబర్, ఫేక్ నంబర్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్‌లను గుర్తించి, వాహనాలను సీజ్ చేయాలన్నారు. సమావేశానికి అదనపు ఎస్పీ ఎన్. రవి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు హాజరయ్యారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్

ఎస్ఐ రాము ▸ మానవపాడు, రాజోలి, వడ్డేపల్లిలో ఫ్లాగ్ మార్చ్

మానవపాడు/ రాజోలి/ వడ్డేపల్లి, జనవరి 10 : శాంతి భద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని మానవపాడు ఎస్ఐ రాము అన్నారు. బుధవారం స్పెషల్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కవాతు నిర్వహించినట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- రాజోలి మండల కేంద్రంలో ఎస్ఐ అబ్దుల్ ఖాద ర్ ఆధ్వర్యంలో బుధవారం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కొత్త రాజోలి నుంచి పాత రాజోలిలోని పోలీస్ స్టేషన్ వరకు కవాతు కొనసాగింది. కార్యక్రమంలో శాంతినగర్ సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు శాంతియుతంగా, నిర్భయంగా ఓటుహక్కు వినియోగించు కోవాలని సీఐ శివశంకర్ గౌడ్ సూచించారు. శాంతి నగర్‌లో బుధవారం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో శాంతినగర్ ఎస్ఐ నరేష్, హెడ్ కానిస్టేబుల్ రాజ వర్ధన్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



శాంతినగర్ పట్టణంలో ఆర్ఏఎఫ్‌తో కలిసి కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జాతీయ స్థాయి పోటీలకు గద్వాల విద్యార్థిని

గద్వాల అర్బన్, జనవరి 10 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థిని నందిని జాతీయ అండర్-14 ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యింది. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన ఆమె ఈ నెల 16 నుంచి 20 వరకు జార్ఖండ్ రాష్ట్రం, రాంచీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొననున్నది. విద్యార్థినిని బుధవారం పాఠశాల హెడ్‌మాస్టర్ ఇమ్మానుయేల్, వ్యాయామ ఉపాధ్యాయులు హైమావతి, స్రవంతి అభినందించారు. పోటీల్లో ప్రతిభను చాటి పాఠశాలకు, జిల్లాకు పేరు, ప్రఖ్యాతులను తేవాలని ఆకాంక్షించారు.

'మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలి'

వడ్డేపల్లి, జనవరి 10 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని కొంకల గ్రామ సర్పంచు బతుకన్న అన్నారు. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. సమస్యలపై కలెక్టర్, ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డులు రాయాలని తీర్మానించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, ఉప సర్పంచు సంజీవనాయుడు, సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ గొల్ల సుధాకర్, ఉపాధ్యాయులు సూరిబాబు, మద్దిలేటి, తిరుపతయ్య, వీరేష్, మజీద్, ప్రభ, దేవి పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగిఉండాలి

మల్దకల్, జనవరి 10: ప్రతీ ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ దేవనాథ జీయర్ స్వామి భక్తులకు సూచించారు. బుధవారం మల్దకల్‌కు చేరుకున్న స్వామిజీకి ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ధీరేంద్రదాసు, మధుసూదనా చారి, అరవిందరావు, వెంకోబరావు, ఎంపీపీ రాజారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెల్లించిన డబ్బు తిరిగివ్వాలి

గద్వాల న్యూటౌన్, జనవరి 10 : గొర్రెల యూనిట్ల కోసం డీడీల రూపంలో చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని కాపరులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు జిల్లా పశువైద్యాధికారికి, కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అలంపూర్ గ్రామానికి చెందిన మహేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు గొర్రెల యూనిట్ కోసం రూ. 43,750 డీడీ తీసి ఇచ్చామని తెలిపారు. ఇప్పడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తాము గొర్రెలు వచ్చే అవకాశం లేదని సందేహాలు వ్యక్తం అవుతున్నాయన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

మానవపాడు, జనవరి 10 : ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ చంద్రన్న తెలిపారు. మండలంలోని జల్లాపురం, బోరవెల్లి గ్రామాల్లో బుధవారం వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వైద్యశిబిరం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన వారందరూ షుగర్, బీపీ, క్యాన్సర్, ఓటీసీటీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోరవెల్లి సర్పంచు విజయ్, ఏవో సుబ్బారెడ్డి, ఏపీఎం మహేష్, సీసీ బాషా పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ పల్లయ్య

గద్వాల టౌన్, జనవరి 10 : విద్యకు క్రమశిక్షణ తోడైతేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య అన్నారు. పట్టణ సమీపంలోని గద్వాల పీజీ కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కొత్త సంవత్సర వేడుకలు, నూతన విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వ వెంకట్‌రెడ్డి, ప్రొఫెసర్లు అరవింద్, రంగారెడ్డి, మహేందర్, రఫీ, గోపీనాథ్ రాథోడ్, మంగళగిరి శ్రీనివాసులు, లక్ష్మణ్, అబిజ్ఞ, గణేష్, నవీన్, వేణుగోపాల్, గట్టయ్య, ప్రేమ్, నరేష్ గౌడ్, లక్ష్మణచారి పాల్గొన్నారు.

సంప్రదాయాలను మరువొద్దు

గట్టు సర్పంచ్ ధనలక్ష్మి

గట్టు, జనవరి 10 : మన సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోవద్దని గట్టు సర్పంచ్ ధనలక్ష్మి విద్యార్థినులకు సూచించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీల్లో ప్రథమ బహుమతిని ఉర్కుందమ్మ, ద్వితీయ బహుమతిని తనూజ, తృతీయ బహుమతిని సంజుల, నాలుగవ బహుమతిని ఎం.పావని సొంతం చేసుకున్నారు. వారికి సర్పంచు నగదు బహుమతులను అందించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వనిత, మహేశ్ వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, కస్తూర్బా పాఠశాల ఎస్‌వో గోపిలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.